క్లుప్తంగా

వ్యాపారులకు శాపంగా కాంగ్రెస్ పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: వ్యాపారులంటే ఎమ్మెల్యేకు ఎందుకంత కక్ష అని, కాంగ్రెస్ పాలన వ్యాపారులకు శాపంగా మారిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరుతో రోడ్డు వెడల్పు సాకుతో దుకాణాలు కూల్చడంతో వ్యాపారులంతా భయాందోళనకు గురవుతున్నారన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి, సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చి సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. వ్యాపారస్తులకు పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయం చూపెట్టిన తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ, గాంధీనగర్‌లో కూల్చివేసిన చిరు వ్యాపారులకు ఇప్పటివరకు ప్రత్యామ్నాయం చూపలేదని ఆరోపించాఆరు. సమావేశంలో నాయకులు మారుతి, బాదె అంజలి, రాకం వేణు, బోడ్డు రవీందర్, సట్టు శ్రీనివాస్, జక్కుల తిరుపతి, మెతుకు దేవరాజ్, తోకల రమేశ్, ఇరుగురాళ్ల శ్రావణ్, ఆవునూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలోని వివిధ సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మధునమ్మ, రాజేశ్వరి, లింగయ్య, స్వామి, నాగరాజు, రాయమల్లు, లక్ష్మి, రజిత, రాణి, ప్రకాశ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

ఎలిగేడు: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అరిఫ్ తెలిపారు. తాగునీటి సమస్యలపై శనివారం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రక్షిత మంచినీటి బావి, వాటర్ ట్యాంకులు, బోర్‌వెల్‌లను పరిశీలించారు. గేట్‌వాల్ సమస్యలు, పైపులైన్ లీకేజీలు ఉండకుండా చూడాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక తయారు చేసి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సూర్యతేజ, కార్యదర్శి అంజలి పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి



మాట్లాడుతున్న అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం బీసీలకు ఎస్సీల వాటా తేల్చి చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వారి నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దున్నపోతుల రాజయ్య, ఎండీ రఫీక్, గాదాసు రవి ఉన్నారు.

నవాబ్‌పేట్‌లో చందాల్ ఉత్సవం



రామగిరి: మండలంలోని నవాబ్‌పేట గ్రామంలో శనివారం చందాల్ ఉత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఫీర్ పహాడ్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఫీర్ పహాడ్ దర్గా వరకు ఊరేగింపు నిర్వహించి అక్కడి మసీద్ వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్యూలో చెప్పులు.. రైతన్న తిప్పలు

- పది గ్రామాలకు ఒకే చోటు నుంచి ఎరువుల సరఫరా
- సకాలంలో యూరియా అందక అవస్థలు పడుతున్న అన్నదాతలు



జూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద క్యూలైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు

జూలపల్లి: మండలంలోని గ్రామాల్లో నాట్లు పూర్తి చేసిన రైతులు కలుపు ముందు వేసే యూరియా కోసం అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్నకు, వరికి యురియా తక్షణ అవసరం ఉండడంతో రైతులు విక్రయ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. జూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న యూరియా పది గ్రామాలకు ఒకే చోటు నుంచి పంపిణీ చేస్తున్నారు. దీంతో యూరియా కోసం ఉదయమే వచ్చిన రైతులు గోదాం తెరవక పోవడంతో చెప్పులు క్యూలైన్‌లో పెట్టి వేచి చూశారు. ఇంతలో జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి, ఏవో ప్రత్యూషతో కలిసి విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి 900 బస్తాలు నిల్వ ఉన్నా, ఎందుకు గోదాం తెరవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పది గ్రామాల రైతులు రావడంతో రద్దీ..

జూలపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని జూలపల్లి, పెద్దాపూర్, కుర్మపల్లె, కోనరావుపేట, కుమ్మరికుంట గ్రామాల రైతులకు ఎరువులు సరఫరా చేయాల్సి ఉంది. కానీ పత్తిపాక పరిధిలోని అబ్బాపూర్, దూళికట్ట పరిధిలోని వడ్కాపూర్, బాలరాజుపల్లె, కీచులాటపల్లె, కాచాపూర్, ఎలిగేడు సహకార సంఘం పరిధిలోని తేలుకుంట, చీమలపేట రైతులు ఇక్కడే యూరియా కోసం రావడంతో రద్దీ ఏర్పడింది.

రైతులు ఆందోళన చెందొద్దు



మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది. మార్క్‌ఫెడ్ ద్వారా మండలానికి సహకార సంఘంతో పాటు ప్రైవేటు ద్వారా 111 మెట్రిక్ టన్నుల యూరియా, 53 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సు, 27 టన్నుల పొటాష్, 15 టన్నుల సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు 1634.9 టన్నుల యూరియా సరఫరా చేయగా, మరో 1340.1 టన్నుల యూరియా సరఫరా చేసేందుకు ఆర్డరు పెట్టాం. యూరియాకు ఎలాంటి కొరత లేదు. మరో 55 టన్నుల యూరియా వస్తుంది. రైతులు ఆందోళన చెందొద్దు. – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యం



సంబరాల్లో బీజేపీ నాయకులు

సుల్తానాబాద్: రాష్ట్రంలో కాషాయ జెండా అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలో బీజేపీ గెలుపొందడంతో మండల కేంద్రంలోని కాల్వ శ్రీరాంపూర్ చౌరస్తా వద్ద శనివారం సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజులన్నీ బీజేపీవేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలో గ్రూపులు లేకుండా అందరినీ ఒకే దాటిపైకి తీసుకువచ్చి అన్ని స్థానాల్లో పోటీచేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సుల్తానాబాద్‌కు మొదటిసారిగా వచ్చిన ఆయనను సన్మానించారు. అనంతరం టపాసులు పేల్చి, దుకాణాలకు స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ, మండల అధ్యక్షుడులు కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చాతరాజు రమేశ్, మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము తిరుపతియాదవ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు లంక శంకర్, పట్టణ మాజీ అధ్యక్షుడు ఎల్లెంకి రాజన్న, కామని రాజేంద్రప్రసాద్, నాయకులు ఎలవేణి తిరుపతి, కుమార్, సంపత్, సంతోష్, మహేందర్‌యాదవ్, రమేశ్, వెంకటేశ్, మల్లేశం పాల్గొన్నారు.

మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు రెవెన్యూ, ట్రేడ్, ఎల్ఆర్ఎస్ మేళాలను నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూకు సంబంధించిన కొత్త ఇంటి నంబర్లు, పేర్లు తప్పుగా ఉన్న, పేరు మార్పిడి కోసం, ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి పాత ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కోసం, కొత్త ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తుల కోసం, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన, అనధికార ప్లాట్‌ను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్చి31 వరకు చివరి అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ హరిహర క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, గౌరిపూజ, నవగ్రహ, వాస్తు క్షేత్రపాలక సరవతోబద్ర మండల స్థాపన పూజ, కలశస్థాపన అమ్మవారి పూజ, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎరబాటి రాజేశ్వర్‌రావు నేతృత్వంలో రుత్వికులు ప్రవీణ్ శర్మ, దత్తు శర్మ, కృష్ణ శర్మ వేద మంత్రాలతో పూజలు చేశారు. హైకోర్టు న్యాయవాది ఎరబాటి అశోక్‌రావు దంపతులు హోమ క్రతువు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం నాయకులు నార్ల రాజన్న, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులి కిషన్‌రెడ్డి, రఘుపతిరావు, నర్సింహారెడ్డి, టి.ప్రసాద్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోపణలు ఖండిస్తున్నాం

గోదావరిఖని: టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిపై చేసిన వ్యక్తిగత ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి పేర్కొన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక వాగ్దానాలు ఇచ్చి గెలిచిన ఐఎన్‌టీయూసీ 14 నెలల్లో ఏ ఒక్క హక్కు సాధించలేదన్నారు. నాయకులు వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు జావిద్ పాషా, చెల్పూరి సతీశ్, పొలాడి శ్రీనివాస్‌రావు, చెల్కలపల్లి శ్రీనివాస్, కోండ్ర అంజయ్య, వాసర్ల జోసెఫ్, గోపి, బొగ్గుల సాయి, మీసరాజు, వెంకటస్వామి, నరేశ్, ఐలయ్య, భాస్కర్, పోషం పాల్గొన్నారు.

బిల్డింగ్ మేస్త్రీలకు త్వరలో గుర్తింపు కార్డులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రాంతంలో పనిచేస్తున్న స్థానిక బిల్డింగ్ వర్కర్లు, మేస్త్రీలు, భవన నిర్మాణ గుత్తేదారులకు త్వరలో గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు భవన నిర్మాణ రంగ కార్మిక అసోసియేషన్ నాయకులు తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేస్తున్న బిల్డింగ్ వర్కర్లు, భవన నిర్మాణ గుత్తేదారులు పనులు మధ్యలో నిలిపి గృహనిర్మాణదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఇళ్లు నిర్మించుకునే వారు పనులు ఇవ్వొద్దని కోరారు. స్థానికంగా ఉండే భవన నిర్మాణరంగ కార్మికులు, మేస్త్రీలు, గుత్తేదారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి మార్చి 1న సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు సయ్యద్ మస్రత్, తాండ్ర సదానందం, పెయింటర్స్, మార్బుల్, ప్లంబర్ ఎలక్ట్రీషియన్ అధ్యక్షుడు పీర్ సయీద్, కల్లెపల్లి రవి, మాచర్ల రమేశ్, నర్సన్న, సమద్, మేస్త్రీ సంఘం నాయకులు చల్లా లక్ష్మన్, కొండ సుధాకర్, కురిమిల్ల సతీశ్, సదానందం, సెంట్రింగ్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలి

గోదావరిఖని: స్థానిక రాజ్యలక్ష్మి గార్డెన్ మార్కండేయకాలనీలో 23న నిర్వహించే అసంఘటిత రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. జీడీకే–11, జీడీకే–5 ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్, ఏరియా ఆసుపత్రి, గనుల్లో శనివారం సమావేశం నిర్వహించారు. కార్మిక, కర్షక ఐక్యత సాధించి కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణపై పోరాడాలన్నారు. ఈ సందర్భంగా కళాకారులతో ఆటపాట కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు ఎం.రాయమల్లు, రాములు, యాకన్న, రత్నకుమార్, రామస్వామి, పల్లె లింగయ్య, జనగామ చిన్నయ్య, సీహెచ్ యాకూబ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని టీటీఎస్ అంతర్గాం క్రీడా మైదానంలో శనివారం అబ్దుల్‌కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్ పటేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌రావు, క్రీడాపోటీల నిర్వాహకుడు అంగోతు రవినాయక్, మాజీ ప్రజాప్రతినిధులు రాజేశ్, ప్రణీత్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓదెల తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ఓదెల: ఓదెల తహసీల్దార్‌గా సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు తహసీల్దార్‌గా పనిచేసిన యాకయ్య కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

సంక్షిప్త వార్తలు

• పాఠశాలల పరిశీలన

మంథని: మండలంలో ని గుంజపడుగు కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ శనివారం పరిశీలించారు. జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు ఆంగ్లం, తెలుగు భాషల్లో కనీస సామర్థ్య చదవడం, రాయడాన్ని పరిశీలిస్తున్నారు. ఎంఈవో లక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డాక్టర్ సురేశ్, ఎం.శ్రీనివాస్, ఎంఎంవో హరిప్రసాద్, రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్ సంపత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవి, సీఆర్పీలు మల్లయ్య, రాధిక పాల్గొన్నారు.

• వేడుకలు అధికారికంగా నిర్వహించాలి

రామగుండం: గిరిజనుల ఆరాధ్యగురువు సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి 15న జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలని జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాయిరామ్‌నాయక్ కోరారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు.

• పోలింగు కేంద్రాల సందర్శన

ఓదెల: మండలంలోని పోలింగు కేంద్రాలను ఓదెల ఎంపీడీవో జి.తిరుపతి శనివారం సందర్శించారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా ముందస్తుగా మండలంలోని పోలింగు కేంద్రాల్లో సౌకర్యాల గురించి ఆరా తీశారు. మండలంలోని పాఠశాలల్లోని పోలింగు కేంద్రాల్లో చుట్టూ పరిసరాలు, విద్యుత్, మంచినీటి సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

• ఎంఈవోకు సన్మానం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంఈవోగా పని చేసి బదిలీ అయిన సురేందర్ కుమార్‌ను శనివారం ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయుల సంఘం బాధ్యులు కె.సారయ్య, మహమ్మద్ మన్సూర్, అనిల్‌కుమార్, రాజు, లచ్చన్న, రామ్మూర్తి, మహేశ్, రవికుమార్, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, సదానందం పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం భీష్మ ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం, నారాయణ సూక్తం పఠించారు. అర్చక పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

• పాక్షికంగా ఇల్లు దగ్ధం

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తడకపెల్లి శంకర్ పెంకుటిల్లు పాక్షికంగా కాలిపోయింది. శంకర్ కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా విద్యుత్ వైర్ల నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే నీటితో ఆర్పివేశారు. ఇల్లు పాక్షికంగా కాలి రూ.50వేల నష్టం జరిగినట్లు ఇంటి యజమాని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

• మెడికల్ షాపులో దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని శివశంకర్ మెడికల్ షాపులో శనివారం దొంగతనం జరిగింది. బాధితుడు సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం షాపు తెరిచెందుకు వెళ్లగా అప్పటికే తాళం పగలకొట్టి ఉంది. షాపులోకి వెళ్లి చూడగా రూ.24వేల నగదు, ఒక స్మార్ట్ ఫోన్ అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


• ఎన్‌డీడీ కార్యక్రమం వాయిదా

ధర్మారం: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 10న చేపట్టిన ఎన్‌డీడీ కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు మండలంలోని మేడారం వైద్యాధికారి సుష్మిత తెలిపారు.

• ఉద్యోగులు సంఘటితంగా ఉండాలి

రామగుండం: సంఘాలు వేరైనా విద్యుత్ ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే విద్యుత్ ఉత్పత్తిలో నిర్దేశిత లక్ష్యసాధన సాధ్యమవుతుందని బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. శనివారం రామగుండంలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పూర్తి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యుత్ కేంద్రాలు స్థాపన జరగడంతో ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆదేశించారు. అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్, మోహన్, రాజ్‌కుమార్, కరణ్‌కుమార్, రవీందర్, అరుణ్‌కుమార్, శంకర్, దుర్గయ్య, పురుషోత్తం, రమేశ్, అన్వేష్, ఇంజినీర్లు, పరిపాలన విభాగం అధికారులు ఉన్నారు.

పంటలకు సరిపడా యూరియా నిల్వలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

ధర్మారం: యాసంగి పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ధర్మారం, దొంగతుర్తి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రెండు ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కాంద్రాలు, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతులకు నిరంతరం ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డు పక్కన ఉన్న సైడ్ కాలువ ప్రమాదకరంగా ఉంది. ఇటీవల హెచ్‌కేఆర్ సంస్థ ఆధ్వర్యంలో కాలువపై ఉన్న సిమెంట్ బిల్లలను తొలగించి మళ్లీ వాటిని కాలువపై అమర్చడం మరచిపోయారు. దీంతో కాలువపై సిమెంట్ బిల్లలు లేకపోవడంతో వ్యాపార సంస్థ వద్దకు వచ్చే ప్రజలు రోడ్డున వెళ్లే వారు అందులో పడిపోయే అవకాశాలు ఉన్నాయి. కాలువపై బిల్లలు తొలగింపుతో మట్టి నిండి మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కరించాలి





ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌కు, ఆర్జీ–2 జీఎం వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కరించాలని సీఎంవోఏఐ ఆధ్వర్యంలో ఆర్జీ–1, 2 జీఎంలు లలిత్‌కుమార్, వెంకటయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. అధికారులకు రావాలిసన పీఆర్‌పీ వెంటనే అమలు చేయాలని, గతేడాది నవంబర్‌లో నిర్వహించిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకవచ్చిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పానుగోటి శ్రీనివాస్, ఆర్జీ–1 ఏరియా అధ్యక్షుడు బి.మల్లేశ్, నాయకులు శ్రీనివాస్, విష్ణు, అంజయ్య, క్రాంతి పాల్గొని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్జీ–2 ఏరియాలో అధికారుల సంఘం నాయకులు జీఎం వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ఏరియా అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు చంద్రశేఖర్, నరేశ్, జనార్దన్, రామకృష్ణ, సుగుణాకర్, నితిన్, సంజీవ్ పాల్గొన్నారు.

పీఆర్‌పీ బకాయిలు వెంటనే చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

రామగిరి: అధికారులందరికీ జీతంలో భాగమైన పర్ఫామెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) బకాయిలు వెంటనే చెల్లించాలని ఆర్జీ–3 ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ కోరారు. ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. పీఆర్‌పీ 2022–23కు సంబంధించి కోల్ ఇండియాలో చెల్లించినప్పటికీ సింగరేణి సంస్థలో ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. పీఆర్‌పీ చెల్లింపు త్వరగా పూర్తి చేయడంతో పాటు అధికారుల సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. నిజాయతీగా పనిచేసే అధికారులకు భరోసా కల్పించి, లక్ష్య సాధనలో పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం వినతిపత్రాలను జీఎంల ద్వారా సీఅండ్‌ఎండీకి పంపిచనున్నట్లు అధికారుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఏరియా అధికారుల సంఘం ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, మనోహర్, సుదర్శనం, శ్రీహరి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



గోదావరిఖని: స్వీటు తినిపిస్తున్న సంధ్యారాణి



ఓదెల: కొలనూర్‌లో సంబరాలు

గోదావరిఖని: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపొందడంపై హర్షిస్తూ శనివారం గోదావరిఖనిలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించి చిరు వ్యాపారులకు స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు మేరుగు హన్మంత్‌గౌడ్, కోమల మహేశ్, గాండ్ల ధర్మపురి, జక్కుల నరహరి, కోడూరి రమేశ్, గుండ బోయిన భూమయ్య, మిట్టపల్లి సతీశ్, కొండపర్తి సంజీవ్, బాణాల స్వామి, సిలివేరి అంజి, తడగొండ నర్సయ్య, రాకేశ్, కుర్ర రాజేందర్, మేరుగు శ్రీనివాస్, అందె రాజకుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంపై శనివారం జిల్లా కేంద్రంలో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు పర్శ సమ్మయ్య, జంగా చక్రధర రెడ్డి, అక్కెపల్లి క్రాంతికుమార్, బెజ్జంకి దిలీప్ కుమార్, శివంగారి సతీశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేశ్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, సీనియర్ నాయకులు రాజేశ్వరరావు, సంపత్‌రావు, కౌన్సిల్ మెంబర్స్ రాజగోపాల్, శ్రీనివాస్, తిరుపతి, పడాల శ్రీధర్ పాల్గొన్నారు.

జూలపల్లి: స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, నాయకులు సంతోష్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గుమ్మడి శంకరయ్య, బొజ్జ సంపత్, రాజు, లక్ష్మన్, రవి, కొమ్మ మహేందర్, మోహన్ రెడ్డి, రమేశ్, సంతోష్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ ఖైరున్నీసాతాజ్, నాయకులు గోపు మల్లారెడ్డి, డాక్టర్ వెంకన్న, పుల్ల సదయ్య, పర్శ శ్రీనివాస్, మాడ్గుల ఎల్లారెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గంగయ్య, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.